అంతరాష్ట్ర బదిలీలకు అవకాశం కల్పించండి

ఉద్యోగ సంఘాల నేతలను కోరిన ఇరు రాష్ట్రాల ఉద్యోగులు

హైదరాబాద్, నవంబర్ 25 (నమస్తే తెలంగాణ): అంతరాష్ట్ర బదిలీలకు అవకాశం కల్పించాలని ఏపీ, తెలంగాణ ఎన్జీవోల సంఘం నేతలను ఉద్యోగులు కోరారు. నాంపల్లి టీఎన్జీవో కార్యాలయంలో టీఎన్జీవో, ఏపీ ఎన్జీవో సంఘాల నేతలను కలిసి బదిలీలపై సంప్రదింపులు జరిపారు. టీఎన్జీవో రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి ముజీబ్ హుస్సేనీ, ఏపీ ఎన్జీవో ప్రధాన కార్యదర్శి పురుషోత్తమనాయుడు, ఉపాధ్యక్షులు రమణ, సాయిరాం సంప్రదింపుల్లో పాల్గొన్నారు. రాష్ట్ర విభజన సమయంలో జిల్లా, జోనల్, మల్టీజోనల్ క్యాడర్ ఉద్యోగులకు ఆప్షన్లు ఇవ్వలేదు. దీంతో స్థానికేతర ఉద్యోగులు ఏపీ, తెలంగాణల్లో పనిచేస్తున్నారు. రిజర్వేషన్లు, స్థానికత కోల్పోవడంతో ఇబ్బందులు పడుతున్నామని ఉద్యోగులు తమ సమస్యలను ఏకరువు పెట్టారు. త్వరలోనే ముఖ్యమంత్రులను కలిసి సమస్యల పర్కిష్కారానికి కృషిచేస్తామని ఇరు రాష్ట్రాల ఉద్యోగులకు నేతలు హామీ ఇచ్చారు.

నేడు జేఎల్ అభ్యర్థుల సర్టిఫికేషన్

హైదరాబాద్, నవంబర్ 25 (నమస్తే తెలంగాణ): జూనియర్ లెక్చరర్(జేఎల్) పోస్టుల భర్తీలో భాగంగా నేడు మరి కొంతమంది అభ్యర్థులకు సర్టిఫికెట్ వెరిఫికేషన్‌ను నిర్వహించనున్నట్టు టీజీపీఎస్సీ ప్రకటించింది. బోటనీ, హిందీ, తెలుగు, జువాలజీ అభ్యర్థులకు పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో ఉదయం 10:30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు వెరిఫికేషన్‌ను నిర్వహిస్తామని టీజీపీఎస్సీ కార్యదర్శి నవీన్ నికోలస్ తెలిపారు. గైర్హాజరైన వారికి 27న రిజర్వ్ డేలో సర్టిఫికెట్ వెరిఫికేషన్ నిర్వహిస్తామని పేర్కొన్నారు.

డిగ్రీ కాలేజీల బంద్ విరమణ

- **నేటి నుంచి యథాతథంగా పరీక్షలు**

హైదరాబాద్, నవంబర్ 25 (నమస్తే తెలంగాణ): ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలంటూ 19 నుంచి నిరవధిక బంద్‌ను పాటిస్తున్న తెలంగాణ డిగ్రీ కాలేజీల యాజమాన్య సంఘం కాస్త వెనక్కి తగ్గింది. పరీక్షల నిర్వహణకు సహకరించాలని నిర్ణయం తీసుకున్నట్టు యాజమాన్యం సంఘం అధ్యక్షుడు సూర్యనారాయణ రెడ్డి తెలిపారు. డిసెంబర్ 10లోపు రీయింబర్స్‌మెంట్ బకాయిలను చెల్లిస్తామని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టమైన హామీ ఇవ్వడంతో పరీక్షలకు సహరించాలని నిర్ణయించినట్టు వెల్లడించారు. మంగళవారం నుంచి పాలమూరు, తెలంగాణ, శాతావాహన వర్సిటీల్లో డిగ్రీ సెమిస్టర్ పరీక్షలు యథాతథంగా జరగనున్నాయి. సాంకేతిక సమస్యలతో కేయూ పరిధిలో మాత్రం మూడు రోజులపాటు పరీక్షలను వాయిదావేశారు.

నిలిచిన క్రాఫ్ట్ టీచర్ల సర్టిఫికేషన్

- **యథావిధిగా మ్యూజిక్ టీచర్ల వెరిఫికేషన్: ట్రిబ్ చైర్మన్ సైదులు**

హైదరాబాద్, నవంబర్25 (నమస్తే తెలంగాణ): హైకోర్టు డివిజన్ బెంచ్ ఆదేశాల నేపథ్యంలో గురుకులాల్లో క్రాఫ్ట్ టీచర్ల సర్టిఫికెట్ వెరిఫికేషన్ నిలిచిపోయిందని, త్వరలోనే షెడ్యూల్‌ను ప్రకటిస్తామని ట్రిబ్ చైర్మన్ సైదులు వెల్లడించారు. సోమవారం ప్రకటన విడుదల చేశారు. 1:2 జాబితాలోని క్రాఫ్ట్, మ్యూజిక్ టీచర్ల పోస్టుల అభ్యర్థులకు 27 నుంచి 29 వరకు సర్టిఫికేషన్ వెరిఫికేషన్ నిర్వహించాలని తొలుత నిర్ణయించారు. హైకోర్టు ఆదేశాల నేపథ్యంలో కేవలం క్రాఫ్ట్ టీచర్ల సర్టిఫికెట్ వెరిఫికేషన్‌ను మాత్రమే నిలిపివేశామని, షెడ్యూల్ ప్రకారం మ్యూజిక్ టీచర్ పోస్టుల సర్టిఫికేషన్ వెరిఫికేషన్ యథావిధిగా కొనసాగుతుందని ట్రిబ్ చైర్మన్ సైదులు స్పష్టం చేశారు. 27 నుంచి 29 వరకు మ్యూజిక్ టీచర్ల అభ్యర్థులు మాసాబ్ ట్యాంక్‌లోని డీఎస్ఎస్ భవన్‌కు ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని సూచించారు. https://treirb.cgg.gov.in లో షెడ్యూల్ చూసుకోవచ్చని పేర్కొన్నారు.

సోషల్ ఆడిట్ డైరెక్టర్ నియామకానికి కసరత్తు

వచ్చేనెల 15లోగా భర్తీ చేయాలని నిర్ణయం

హైదరాబాద్, నవంబర్ 25 (నమస్తే తెలంగాణ): జాతీయ ఉపాధిహామీ పథకం అమలులో కీలకంగా వ్యవహరించే సోషల్ ఆడిట్ డైరెక్టర్ నియామకానికి ప్రభుత్వం కసరత్తు చేస్తున్నది. తెలంగాణ సొసైటీ ఫర్ సోషల్ ఆడిట్, అకౌంటబిలిటీ అండ్ ట్రాన్స్‌ఫరెన్సీ డైరెక్టర్‌ను కాంట్రాక్ట్ పద్ధతిన నియమించేందుకు చర్యలు చేపట్టింది. నోటిఫికేషన్ ఇచ్చి దరఖాస్తులు స్వీకరించింది. శనివారంతో గడువు ముగియగా 56 అప్లికేషన్లు వచ్చాయి. దరఖాస్తుల పరిశీలన తర్వాత అర్హత గల అభ్యర్థిని ఎంపిక చేస్తామని పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు తెలిపారు. వచ్చే నెల 15న భర్తీ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.

'బిల్డాక్స్' ప్రీలాంచ్ స్కామ్!

వివాదంలో ఉన్న భూమిలో ప్రాజెక్టు

సోషల్ మీడియాలో అదిరిపోయే బ్రోచర్లు

- **అనుమతులు లేకుండా ముందస్తు సేల్**
- **అరచేతిలో వినియోగదారులకు స్వర్గం**
- **మోసపోయిన వినియోగదారుడి ఫిర్యాదు**
- **రూ.1.6 లక్షల జరిమానా విధించిన రెరా**
- **బయ్యర్ అడ్వాన్స్ వెనక్కివ్వాలని ఆదేశం**

హైదరాబాద్ సిటీబ్యూరో, నవంబరు 25 (నమస్తే తెలంగాణ): సోషల్ మీడియా వేదికగా గ్రాఫిక్ డిజైన్లు ఎరవేసి కొనుగోలుదారులను మోసగించే ప్రయత్నం చేసిన రియల్ ఎస్టేట్ సంస్థ బిల్డాక్స్ ప్రైవేట్ లిమిటెడ్ బాగోతం బయటపడింది. కొనుగోలుదారుడి ఫిర్యాదుతో తీగ లాగితే డొంక కదిలింది. ప్రాజెక్టు లేకుండానే ప్లాట్లను విక్రయించిన అడ్డంగా దొరికిపోయింది. కొండాపూర్ సమీపంలోని హఫీజ్‌పేట్ సర్వే నంబర్ 80 పరిధిలో బిల్డాక్స్ అనే రియల్ ఎస్టేట్ సంస్థ ఫేస్‌బుక్ వేదికగా 'ద కాంటినెంట్ ప్రాజెక్టు'ను చేపడుతున్నట్టు ప్రీ లాంచ్ అమ్మకాలకు దిగింది. అయితే, ఎలాంటి అనుమతులు లేకుండానే బిల్డాక్స్ అమ్మకాలు సాగిస్తున్నట్టు అందిన ఫిర్యాదుపై రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ (రెరా) సీరియస్ అయింది. కంపెనీకి రూ. 1.6 లక్షల జరిమానా విధించిన రెరా అధికారులు, కొనుగోలుదారుడు చెలించిన రూ. 2 లక్షల అడ్వాన్స్ వెనక్కి ఇవ్వాలని ఆదేశించారు.

వినియోగదారుడి ఫిర్యాదుతో వెలుగులోకి

అనుమతి లేకుండానే బిల్డాక్స్ కంపెనీ ప్లాట్ల అమ్మకాలు చేపడుతున్నట్టు శరత్ అనే కొనుగోలుదారుడు రెరాలో ఫిర్యాదు చేశారు. హెక్సాస్కై ఇన్‌ఫ్రా సంస్థ ద్వారా అమ్మకాలు జరుగుతున్నాయని, దీని డైరెక్టర్‌గా చెప్పుకునే దామోదర ప్రసాద్ బిల్డాక్స్ కార్యాలయంలో తనతో మాట్లాడారని చెప్పారు. 2028 నాటికి ఫ్లాట్ హ్యాండోవర్ చేస్తానని హామీ ఇవ్వడంతో ఈ ఏడాది ఫిబ్రవరిలో రూ. 2 లక్షలు అడ్వాన్స్ చెల్లించినట్టు తెలిపారు. అయితే, ఆ తర్వాత ఆరా తీస్తే బిల్డాక్స్ ప్రాజెక్టుకు అసలు అనుమతులే లేవని, ప్రాజెక్టును ప్రతిపాదించిన భూమి కూడా వివాదంలో ఉన్నదని తెలిసిందని పేర్కొన్నారు. మోసపోయినట్టు భావించి రెరాను ఆశ్రయించారు. ఆయన ఫిర్యాదుపై విచారణ చేపట్టిన రెరా బిల్డాక్స్ అక్రమాలకు పాల్పడిందని, బ్యాంకు అకౌంట్ స్టేట్‌మెంట్ల ఆధారంగా అక్రమాలు జరిగినట్టు నిర్ధారించింది. దీంతో రెరాకు రూ. 1.6 లక్షల జరిమానా విధించింది. బాధితుడు శరత్ చెల్లించిన రూ. 2 లక్షలు తిరిగి ఇవ్వాలని ఆదేశించింది.

సుప్రీంకోర్టులో కేసు

హఫీజ్‌పేట్ సర్వే నంబర్ 80 పరిధిలోని భూమి విషయంలో ప్రభుత్వానికి, కొందరు ప్రైవేట్ వ్యక్తులకు మధ్య సుప్రీంకోర్టులో కేసు నడుస్తున్నది. ఆ విషయాన్ని దాచిపెట్టి బిల్డాక్స్ సంస్థ ప్రీలాంచ్ దందాకు తెరలేపింది. కొనుగోలుదారులకు తెలియకుండా సోషల్‌మీడియా వేదికగా 30 ఎకరాలకు పైగా స్థలంలో 35 అంతస్తులను నిర్మిస్తామని చెప్తూ ప్లాట్లు విక్రయిస్తున్నది. రెండు వారాల్లో వందశాతం సొమ్ము చెల్లించే వారికి చదరపు అడుగును రూ.4,500కే ఇస్తామని నమ్మించింది. సుప్రీంకోర్టులో ఈ స్థలంపై వివాదం కొనసాగుతున్నప్పటికీ బిల్డాక్స్ అమ్మకాలు జరుపుతూ వచ్చింది. ఇది బిల్డాక్స్-వాసవి సంస్థ జాయింట్ వెంచర్ అని ఏజెంట్లు చెప్తుండడం గమనార్హం.

అంటకాగుతున్న వాసవి

నిజానికి బిల్డాక్స్ కంపెనీ నగరంలో భారీ ప్రాజెక్టులు చేపట్టింది లేదు. కానీ, హైరైజ్ ప్రాజెక్టుల పేరిట అమాయకులను మోసం చేస్తూ వస్తున్నది. ఈ క్రమంలో అత్యంత డిమాండ్ ఉన్న హఫీజ్‌పేట్ ప్రాంతంలోని వివాదస్పద భూమిని కేంద్రంగా చేసుకుని వ్యాపారానికి తెరలేపింది. ఈ క్రమంలో కలర్‌ఫుల్ డిజైన్లు, గ్రాఫిక్ వీడియోలతో సోషల్ మీడియాలో సామాన్యుడి కలల ప్రపంచాన్ని సృష్టించింది. ఎలాంటి అనుమతులు, నిర్మాణ కార్యకలాపాలు లేకుండా కార్పొరేట్ సంస్థల మాటున రియల్ మోసాలకు తెగబడిందనే ఆరోపణలు ఉన్నాయి. సర్వే నంబర్ 80లో తవ్వకాలు లేకుండానే ఫ్యూచర్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టుగా చిత్రీకరించి నిబంధనలకు విరుద్ధంగా ప్రీ లాంచ్‌కు తెగబడింది. దీంతో అందిన కాడికి అమాయకుల నుంచి లక్షల రూపాయలు వసూలు చేసిందనే ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికీ ఆ స్థలం సుప్రీం కోర్టు పరిధిలోనే ఉందనీ, దానిపై స్టేటస్ కో కొనసాగుతున్నదని పలువురు తెలిపారు. వరల్డ్ క్లాస్ హైరైజ్ ప్రాజెక్టు పేరిట జనాల సొమ్ములను లాగేసుకున్న బిల్డాక్స్ కంపెనీతో హైదరాబాద్ కేంద్రంగా ప్రముఖ రియల్ ఎస్టేట్ సంస్థ వాసవి గ్రూప్ అంటకాగుతుందనే ఆరోపణలు ఉన్నాయి. కాగితాలకే పరిమితమైన ద కాంటినెంట్ ప్రాజెక్టును బూచిగా చూపెట్టి, అమాయకులను మోసం చేస్తున్న కంపెనీతో కలిసి వాసవి గ్రూప్ గుండ్లపోచంపల్లి ప్రాంతంలో లగ్జరీ ప్రాజెక్టును చేపట్టింది. వాసవి బిల్డాక్స్ భువీ పేరిట ప్రాజెక్టును నిర్మిస్తున్నది. ప్రస్తుతం ఈ ప్రాజెక్టు నిర్మాణంలో ఉండగా తాజాగా వెలుగులోకి వచ్చిన బిల్డాక్స్ ప్రీ లాంచ్ బాగోతాలు ఇప్పుడు చర్చనీయాంశంగా మారాయి.

వెలుగులోకి మరో ప్రీలాంచ్ మోసం

- **200 మందికి టోకరా**
- **రూ.48 కోట్లతో పరార్**
- **నిందితుల అరెస్ట్.. రిమాండ్**

హైదరాబాద్ సిటీబ్యూరో, నవంబర్ 25 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ నగరంలో ప్రీ లాంచ్ మోసాలు రోజురోజుకు పెరిగిపోతున్నాయి. మొన్న రూ.300 కోట్ల మోసం మరువక ముందే తాజాగా మరో ప్రీ లాంచ్ మోసం వెలుగులోకి వచ్చింది. ప్రీ లాంచింగ్ స్కీమ్ పేరుతో దాదాపు 200 మంది నుంచి రూ.48 కోట్లు వసూలు చేసి పత్తాలేకుండా పోయిన ఇద్దరు ఘరానా మోసగాళ్లను సైబరాబాద్ పోలీసులు అరెస్టు చేశారు. కూకట్‌పల్లి ప్రాంతానికి చెందిన చక్క భాస్కర్ 'ఆర్ హోమ్స్ ఇన్‌ఫ్రా డెవలపర్స్ ప్రైవేట్ లిమిటెడ్'కు చైర్మన్‌గా వ్యవహరిస్తున్నాడు. అతడి భార్య సుధారాణి మేనేజింగ్ డైరెక్టర్‌గా పనిచేస్తున్నారు. భార్యాభర్తలిద్దరూ అమాయక ప్రజల నుంచి పెద్ద ఎత్తు డబ్బులు వసూలు చేయాలనే లక్ష్యంతో ప్రీ లాంచింగ్‌ను ప్రాంరభించారు. సంబంధిత అధికారుల నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా, సరైన పత్రాలు లేకుండానే ఘట్‌కేసర్‌లోని యమ్నంపేట్ గ్రామంలో బ్లిస్ హైట్స్ ప్రాజెక్ట్, పటాన్‌చెరు, కడ్డనూర్ గ్రామంలో ఓఆర్ఆర్ ప్రాజెక్ట్, సంగారెడ్డిలోని మురిగి గ్రామంలో 2020-2021 మధ్య కాలంలో ఫామ్ ల్యాండ్ ప్రాజెక్ట్స్‌ను ప్రారంభించారు. మార్కెట్ ధర కంటే తక్కువ ధరకే ఫ్లాట్స్ ఇస్తామని, మూడేండ్లలోపు ప్రాజెక్ట్‌ను పూర్తిచేసి ఫ్లాట్లను అప్పగిస్తామని నమ్మబలికారు. అంతే కాకుండా మూడేండ్లలోపు పూర్తి చేయలేని సందర్భంలో 2బీహెచ్‌కే ఫ్లాట్‌కు రూ.6000, 3బీహెచ్‌కే ఫ్లాట్‌కు రూ.8000 చొప్పున అద్దె చెల్లిస్తామని హామీలు గుప్పించారు. మీడియా, సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున ప్రచారం చేసి, సెలబ్రిటీలతో ప్రకటనలు చేయించి జనాలను ఆకర్శించారు. ఇది నమ్మిన దాదాపు 200 మంది పెద్దఎత్తున పెట్టుబడి పెట్టారు. మూడేండ్లు గడిచినా ఎలాంటి ఫ్లాట్‌లను నిర్మించకపోగా, ఇచ్చిన డబ్బుల విషయమై ప్రశ్నించేందుకు యత్నించగా నిందితులు నగరం నుంచి పారిపోయారు. దీంతో నగరానికి చెందిన మనోజ్‌కుమార్ సైబరాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు సోమవారం చక్క భాస్కర్, సుధారాణి దంపతులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి ఆదేశాల మేరకు డీసీపీ ప్రసాద్ పర్యవేక్షణలో ఏసీపీ సోమనారాయణ్ సింగ్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పింఛన్ కోసం రోడ్డెక్కిన వృద్ధులు

నారాయణపేట జిల్లాలో ఘటన

ధన్వాడ/కొల్లాపూర్, నవంబర్ 25 : పింఛన్ కోసం వృద్ధులు నిత్యం ఏదో ఒక చోట రోడ్డెక్కుతున్నారు. నారాయణపేట జిల్లా ధన్వాడ మండల కేంద్రంలో సోమవారం పింఛన్ డబ్బులు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేసీఆర్ ఉన్నప్పుడు నెలనెలా సక్రమంగా పింఛన్ వచ్చేదని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినంక పింఛన్ డబ్బుల కోసం ఎదురుచూడాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. 18 నుంచి 20వ తేదీలోగా పోస్టాఫీస్‌లో డబ్బులు ఇచ్చేటోళ్లని, ఈ నెల 25వ తేదీ వచ్చినా ఇంకా డబ్బులు ఇవ్వలేదని మండిపడ్డారు. రెండ్రోజుల్లో పింఛన్ వచ్చేలా చూస్తామని పోలీసులు హామీ ఇవ్వడంతో శాంతించారు. అలాగే నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మండలం ముక్కిడిగుండం గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద వృద్ధులు నిరసన వ్యక్తం చేశారు.

ధన్వాడలో పింఛన్ కోసం రోడ్డెక్కిన వృద్ధులు

గొంతులో పూరీలు ఇరుక్కొని బాలుడి మృతి

బేగంపేట్, నవంబర్ 25: స్కూల్‌లో ఓ విద్యార్థి పూరీలు తింటుండగా గొంతులో ఇరుక్కొని ఊపిరాడక మృతి చెందాడు. ఈ ఘటన సోమవారం బేగంపేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్ఐ జయచంద్ర కథనం ప్రకారం.. ఓల్డ్ బోయిగూడకు చెందిన విరేన్‌జైన్(11) ఆరోతరగతి చదువుతున్నాడు. మధ్యాహ్న భోజన సమయంలో మూడు పూరీలు నోట్లో పెట్టుకోవడంతో గొంతులో ఇరుక్కుపోయాయి. పాఠశాల సిబ్బంది విరేన్‌జైన్ తల్లిదండ్రులకు సమాచారం అందించి ఓ ప్రైవేట్ దవాఖానకు తరలించారు. బాలుడు మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

మొదటి జీతం తీసుకోకుండానే మృతి

రోడ్డు ప్రమాదంలో టీచర్ దుర్మరణం • నెల రోజుల క్రితమే సర్కారు కొలువు

ఉపేందర్ (ఫైల్)

బయ్యారం, నవంబర్ 25 : ఏండ్ల తరబడి ఉద్యోగం కోసం ఎదురు చూపు.. ఇక రాదనుకున్న ఉద్యోగం రానే వచ్చింది.. ఆయనతోపాటు ఇంటిల్లిపాదీ ఆనందపడ్డారు.. ఇక తమ కష్టాలు తీరుతాయని సంతోషించారు.. విధి వక్రీకరించింది.. మొదటి నెల జీతం అందుకోకముందే ఉపాధ్యాయుడిని మృత్యువు కబళించింది. మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలం కొత్తపేటకు చెందిన సంద్ర ఉపేందర్ (46) బీఎస్సీ, బీఈడీ పూర్తి చేశాడు. ప్రైవేట్‌గా ఉద్యోగం చేస్తూ కుటుంబాన్ని నెట్టుకొచ్చాడు. ఈ క్రమంలో 2024 డీఎస్సీ ఫలితాల్లో ఎస్‌జీటీగా ఉద్యోగం సాధించడంతో గంగారం మండలం కుర్సవారిగుంపు ప్రాథమిక పాఠశాలలో అక్టోబర్ 16న జాయిన్ అయ్యాడు. సోమవారం బైక్‌పై స్కూల్‌కు వెళ్తుండగా బావురుగొండ గ్రామ సమీపంలో లారీ వెనుక నుంచి వచ్చి ఢీకొట్టడంతో ఉపేందర్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఏండ్లుగా ఆశగా ఎదురుచూసిన ఉద్యోగం వచ్చిన మొదటి నెల జీతం అందుకోక ముందే మృత్యువు ఒడికి చేరారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈ ఘటనతో కొత్తపేటలో విషాదఛాయలు అలుముకున్నాయి.

18 నెలల చిన్నారి సహా తండ్రి ఆత్మహత్య

- **జీవితంలో ఫెయిల్**

అయ్యానని సూసైడ్ నోట్

ఇద్దరు కూతుళ్లతో క్రాంతి (ఫైల్)

ఖలీల్‌వాడి (మోపాల్), నవంబర్ 25: చిన్నారితో కలిసి ఓ తండ్రి చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. జీవితంలో ఏదీ సాధించలేక పోతున్నా. నాకు చావే శరణ్యం. నువ్వు రెండో పెండ్లి చేసుకో అని భార్యనుద్దేశించి సూసైడ్‌నోట్ రాశాడు. నిజామాబాద్ సీతారాంనగర్ కాలనీకి చెందిన క్రాంతికుమార్ (35)కి భార్య మానస, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. ధర్మారం (బీ) గురుకుల పాఠశాలలో డాటా ఎంట్రీ ఆపరేటర్‌గా పని చేస్తున్నాడు. 18 నెలల కూతురుకు చిన్నప్పటి నుంచి మెదడు ఎదుగుదల సరిగా లేకపోవడంతో పాపను దవాఖానల చుట్టూ తిప్పి అప్పుల పాలయ్యాడు. ఆర్థిక ఇబ్బందులు, పాప ఆరోగ్య పరిస్థితి క్రాంతిని మానసిక వేదనకు గురిచేశాయి. సోమవారం తెల్లవారుజామున చిన్నారితో పాటు చెరువులోకి దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి మృతదేహాలను వెలికి తీయించారు. క్రాంతి రాసిన సూసైడ్ స్వాధీనం చేసుకున్నారు.

మరణంలోనూ వీడని బంధం

- ***ఒకేరోజు భార్యాభర్తల మృతి***

భార్యాభర్తలు వీరయ్య, ఎల్లమ్మ (ఫైల్)

నూతనకల్, నవంబర్ 25 : భార్యాభర్తలుగా వారు ఎంతో అన్యోన్యంగా జీవనం సాగించారు. వృద్ధాప్యంలో ఒకరికొకరు తోడుగా ఉన్నారు. అనారోగ్యం కారణంగా ఒకేరోజు మృతి చెందారు. సూర్యాపేట జిల్లా నూతనకల్ మండలం మిర్యాలకు చెందిన కొమ్ము వీరయ్య (75)-కొమ్ము ఎల్లమ్మ(70) భార్యాభర్తలు. వీరికి ముగ్గురు కుమారులు, ముగ్గురు కుమార్తెలు. కొడుకులు వేరుగా ఉండడంతో వంతులవారిగా తల్లిదండ్రుల ఆలనాపాలన చూస్తున్నారు. వృద్ధ దంపతులు వేరుగా ఒక ఇంట్లో ఉంటున్నారు. కొన్ని రోజులుగా అనారోగ్యంతో వారు మంచానికే పరిమితం కాగా కుటుంబ సభ్యులు సపర్యలు చేస్తున్నారు. అన్యోన్యంగా ఉండే భార్యాభర్తలు ఆదివారం ఒకే రోజు మృతి చెందడంతో పలువురిని కంటతడి పెట్టించింది. సోమవారం మిర్యాలలో అంత్యక్రియలు నిర్వహించారు.

మాజీ సర్పంచుల నిర్బంధం

- **బిల్లులు చెల్లించాలని కరీంనగర్ కలెక్టరేట్ ఎదుట నిరసన**
- **అరెస్ట్ చేసిన పోలీసులు**
- **ఐదు గంటల పాటు పీటీసీలో నిర్బంధం**
- **కలెక్టరేట్ వద్ద ఇష్టారీతిగా వ్యవహించిన పోలీసులు**
- **రెండు గంటల పాటు ఇబ్బందులు పడ్డ ఉద్యోగులు**

కరీంనగర్ కలెక్టరేట్ వద్ద ప్లకార్డులు ప్రదర్శిస్తూ వస్తున్న మాజీ సర్పంచ్‌లను అదుపులోకి తీసుకుని పోలీసు వాహనాల్లోకి ఎక్కిస్తున్న పోలీసులు

కరీంనగర్, నవంబర్ 25 (నమస్తే తెలంగాణ) : పెండింగ్ బిల్లులు ఇప్పించాలని కోరుతూ సోమవారం కరీంనగర్ కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపేందుకు వచ్చిన తాజా మాజీ సర్పంచులను పోలీసులు అరెస్టు చేసి నిర్బంధించారు. స్థానిక పోలీసు శిక్షణా కేంద్రానికి తరలించి ఐదు గంటల పాటు అక్కడే ఉంచారు. మధ్యాహ్నం 12 గంటలకు అదుపులోకి తీసుకోగా సాయంత్రం 5 గంటలకు వదిలేశారు. ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణిలో కలెక్టర్, అధికారులకు వినతి పత్రం ఇచ్చి నిరసన తెలపాలని నిర్ణయించుకున్న మాజీ సర్పంచులు ఉదయం 10 గంటలకు అక్కడికి చేరుకోగా వచ్చిన వారిని వచ్చినట్టు పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా పోలీసులు, మాజీ సర్పంచులకు మధ్య తోపులాట జరిగింది. బలవంతంగా సర్పంచులను పోలీసు వాహనాల్లో ఎక్కించి పీటీసీకి తరలించారు. ఎస్‌బీఐ కలెక్టరేట్ బ్రాంచ్‌లో పనిచేసే ఓ ఉద్యోగి తెల్ల చొక్కా వేసుకుని వస్తే అతను కూడా సర్పంచేనని భావించిన పోలీసులు బలవంతంగా వ్యాన్ ఎక్కించారు. గుర్తింపు కార్డు చూపించిన తర్వాత వదిలేశారు. ఇలా రెండు గంటల పాటు కలెక్టరేట్ ఎదుట పోలీసులు హంగామా సృష్టించారు.

ఐదు గంటల పాటు నిర్బంధం

కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపేందుకు వచ్చిన మాజీ సర్పంచులను అదుపులోకి తీసుకున్న పోలీసులు స్థానిక పోలీసు శిక్షణ కేంద్రానికి తరలించి ఐదు గంటల పాటు నిర్బంధించారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వచ్చిన 40 మంది మాజీ సర్పంచులను మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు అక్కడే ఉంచారు. భోజనం చేయలేదని, షుగర్ ఉన్నదని, కళ్లు తిరుగుతున్నాయని చెప్పినా పోలీసులు వినిపించుకోలేదని మాజీ సర్పంచులు వాపోయారు. మాజీ సర్పంచుల సంఘం కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు జోగు సాగర్, ప్రధాన కార్యదర్శి పంజాల జగన్ మోహన్‌గౌడ్, సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు కరుణసాగర్‌తోపాటు ఉమ్మడి జిల్లాలోని వివిధ మండలాలకు చెందిన మాజీ సర్పంచులను నిర్బంధించిన పోలీసులు చివరికి సొంత పూచీకత్తుపై విడుదల చేశారు. నిరసన తెలిపేందుకు మాజీ సర్పంచులు పెద్ద సంఖ్యలోనే కలెక్టరేట్‌కు వచ్చినా అరెస్టు చేస్తున్న విషయం తెలుసుకుని అక్కడికి రాకుండా ఉన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డినే టార్గెట్ చేస్తాం

గత అసెంబ్లీ ఎన్నికల్లో అధికారంలోకి రాగానే పెండింగ్ బిల్లులు ఇప్పిస్తామని ప్రతి బహిరంగ సభలో చెప్పిన సీఎం రేవంత్‌రెడ్డి ఇప్పుడు మాట మార్చేశారని, అతన్నే టార్గెట్ చేసి ప్రజల్లోకి వెళ్తామని మాజీ సర్పంచుల సంఘం నాయకులు స్పష్టం చేశారు. తమతోపాటు రాష్ట్ర ప్రజలందరినీ మోసం చేశారని, రైతు రుణ మాఫీ, రైతు భరోసా, తులం బంగారం, మహాలక్ష్మి వంటి పథకాలు అమలు చేస్తామని చెప్పి ఒక్కటి కూడా అమలు చేయలేక పోతున్నారని మండిపడ్డారు. ఈ విషయాన్ని క్షేత్ర స్థాయిలో ప్రజలకు వివరిస్తామని మాజీ సర్పంచుల సంఘం నాయకులు పంజాల జగన్ మోహన్ గౌడ్ స్పష్టం చేశారు.

కాంట్రాక్టు ఏఎన్ఎంలను రెగ్యులరైజ్ చేయాలి

- **వైద్య ఆరోగ్య శాఖ సంఘాల పోరాట కమిటీ రాష్ట్ర నాయకుడు యాదనాయక్**
- **డీఎంహెచ్‌వో అధికారులకు వినతిపత్రాలు**

హైదరాబాద్, నవంబర్ 25 (నమస్తే తెలంగాణ): వైద్య ఆరోగ్య శాఖలోని అన్ని విభాగాల ఏఎన్ఎంలను రాత పరీక్ష లేకుండా రెగ్యులరైజ్ చేయాలని వైద్య ఆరోగ్య శాఖ సంఘాల పోరాట కమిటీ రాష్ట్ర నాయకుడు కే యాదనాయక్ డిమాండ్ చేశారు. సోమవారం అన్ని డీఎంహెచ్‌వో కార్యాలయాల ముందు ధర్నాలు చేపట్టి అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. ప్రభుత్వం వేసిన కమిటీ నివేదిక రాకుండానే పరీక్ష తేదీ ప్రకటించడమేంటని ప్రశ్నించారు. రాష్ట్రంలోని 6,500 మంది ఏఎన్ఎంలకు పరీక్షలో 50 మార్కుల వెయిటేజీ ఇవ్వాలని, సమానపనికి సమాన వేతనం, ఆరోగ్య బీమా కల్పించాలని డిమాండ్ చేశారు. జనాభా ప్రాతిపదికన సబ్ సెంటర్లు ఏర్పాటు చేసి పనిభారం తగ్గించాలని కోరారు.

- **దివ్యాంగుల వినూత్న నిరసన**

బస్సుల్లో సీట్లు ఇవ్వడం లేదని దివ్యాంగులు వినూత్న నిరసన తెలిపారు. వరంగల్ జిల్లా వర్ధన్నపేట బస్టాండ్‌లో సోమవారం వారు చీరలు కట్టుకొని ఆందోళన చేశారు. బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం దివ్యాంగులకు శాపంగా మారిందని వికలాంగుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు గిద్దె రాజేశ్ ఆవేదన వ్యక్తంచేశారు. – వర్ధన్నపేట

తహసీల్దార్‌కు నటుడు ఆలీ దరఖాస్తు

అనుమతుల కోసం దరఖాస్తు చేసుకున్న నటుడు ఆలీ

నవాబుపేట, నవంబర్ 25 : వికారాబాద్ జిల్లా నవాబుపేట మండలం తహసీల్దార్ కార్యాలయానికి సోమవారం సినీ నటుడు ఆలీ వచ్చి వ్యవసాయ భూమిని వ్యవసాయేతర భూమిగా మార్చుకోవడానికి దరఖాస్తు చేసుకున్నారు. మండల పరిధిలోని ఎక్‌మామిడి రెవెన్యూ పరిధిలో గల సర్వే నంబర్లు 340, 341, 344, 345లో 5.22 ఎకరాల భూమి విస్తీర్ణానికి సంబంధించి భూమి కోసం తహసీల్దార్ జయరాం నుంచి అనుమతులు పొందారు.

ఆర్జీవీ అరెస్టుకు రంగం సిద్ధం?

హైదరాబాద్‌లో వర్మ ఇంటికి పోలీసులు

హైదరాబాద్, నవంబర్ 25 (నమస్తే తెలంగాణ) : సినీ దర్శకుడు రాంగోపాల్ వర్మ అరెస్టుకు ఏపీ పోలీసులు సిద్ధమయ్యారు. ఏపీ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, మంత్రి లోకేశ్ ఫొటోలు మార్ఫింగ్ చేసి ఎక్స్‌లో పోస్ట్ చేశారన్న కేసులో వర్మ విచారణ ఎదుర్కొంటున్నారు. ఈ విషయంలో ప్రకాశం జిల్లా మద్దిపాడు పీఎస్‌లో కేసు నమోదైంది. వర్మ పోలీసుల విచారణకు గైర్హాజరవుతూ వస్తున్నారు. సోమవారం మరోసారి విచారణకు హాజరుకావాల్సి ఉండగా.. తాను రాలేనంటూ లాయర్ ద్వారా పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు వర్మకు మళ్లీ నోటీసులు ఇచ్చారు.

గాంధీభవన్ ఎదుట ప్లకార్డులతో నిరసన చేస్తున్న ఎన్ఎస్‌యూఐ నాయకులు

తెలంగాణకు ఆంధ్రా నాయకుడా?

గాంధీభవన్ ఎదుట ఎన్ఎస్‌యూఐ నేతల నిరసన

హైదరాబాద్, నవంబర్ 25 (నమస్తేతెలంగాణ): 'తెలంగాణ రాష్ట్ర ఎన్ఎస్‌యూఐకి ఆంధ్రాకు చెందిన నాయకుడెందుకు? ఆయనను వెంటనే తొలగించాలి' అని డిమాండ్ చేస్తూ గాంధీభవన్ ఎదుట రంగారెడ్డి జిల్లా ఎన్ఎస్‌యూఐ నాయకులు సోమవారం ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా ఎన్ఎస్‌యూఐ రంగారెడ్డి జిల్లా ప్రెసిడెండ్ విష్ణువర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడిని మార్చాలని రాష్ట్ర కాంగ్రెస్ నాయకులకు, పార్టీ అధిష్ఠానానికి ఎన్నిసార్లు విన్నవించినా ఎందుకు పట్టించుకోవడం లేదని నిలదీశారు. తెలంగాణ ఆవిర్భవించి పదేండ్లు దాటినా ఆంధ్రా నాయకుల కింద పనిచేయాల్సి రావడం దురదృష్టకరమని వాపోయారు. నేటి ఎన్ఎస్‌యూ ఐ జాతీయ అధ్యక్షుడు తెలంగాణ పర్యటనపై ఎందుకు సమాచారం ఇవ్వలేదని నిలదీశారు. కాంగ్రెస్‌ను అధికారంలోకి తేవడానికి అనేక కేసు లు ఎదుర్కొన్న తమకు దక్కిందేమిటని ఆవేదన వ్యక్తంచేశారు. ఇప్పటికైనా ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్న ఆంధ్రా ప్రాంతానికి చెందిన వెంకటస్వామిని తొలగించాలని డిమాండ్ చేశారు. ఆ తర్వాతే జాతీయ అధ్యక్షుడు వరుణ్‌చౌదరి తెలంగాణలో పర్యటించాలని తేల్చిచెప్పారు.